మూసీ నిర్వాసితుల వినతులకు ప్రత్యేక సెల్

మేడ్చల్ అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మూసీ బాధితుల రీషెల్టర్ సౌకర్యార్థం మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్‌లోని ల్యాండ్‌ప్రొటెక్షన్ సెక్షన్‌లో ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. మూసీ నిర్వాసితులు ఈసెల్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాధితులు నేరుగా కానీ, కార్యాలయ సెల్ నెంబరు 9492409781లో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

పూల జాతర

- ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు


వికారాబాద్‌లోని పాఠశాలలో బతుకమ్మ వేడుకలు


ఘట్‌కేసర్ మండలం ఏదులాబాద్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ వేడుకలు వికారాబాద్, మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాల్లో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. బుధవారం ఎంగిలిపూల బతుకమ్మ పండుగను ఆడపడుచులు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చారు. గౌరమ్మకు పూజలు చేశారు. కూడళ్లు, కాలనీల్లో బతుకమ్మలను ఒక్కచోటికి చేర్చి ఆడిపాడారు. అనంతరం పాటలు పాడుకుంటూ ర్యాలీగా వెళ్లి చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేసి ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ వేడుకలతో జిల్లాలో సందడి వాతావరణం నెలకొంది.

- ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 2

కీసరలో భారీ వర్షం



కీసర, అక్టోబరు 2: కీసరలో భారీ వర్షం కురిసింది. ఉదయం తీవ్ర ఎండ, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి కుండపోత వర్షం కురిసింది. ఓవైపు వర్షం కురుస్తూనే, మరోవైపు ఎండకొట్టడం గమనార్హం. కాగా రెండు మూడు రోజులుగా తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన జనం బుధవారం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు.


మాట్లాడుతున్న గోపి రజక

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

- సీఎం రేవంత్‌రెడ్డి మాట నిలబెట్టుకోవాలి
- రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక

బషీరాబాద్, అక్టోబరు 2: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలనే అంశంపై గతంలో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక అన్నారు. బుధవారం బషీరాబాద్‌లో రజక సంఘం మండల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో ప్రతిపక్ష నేతగా రేవంత్‌రెడ్డి రజకుల పట్ల సానుకూలంగా స్పందిస్తూ ఎస్సీ జాబితాలో చేర్చి, సంక్షేమ పథకాలు అందించాని అసెంబ్లీలో డిమాండ్ చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి సీఎం హోదాలో ఉన్నారని, రజకుల రిజర్వేషన్లకు సంబంధించి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలన్నారు. రజకులకు సంక్షేమ పథకాల కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించి, గ్రామాల్లో నిరుద్యో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎక్మాయి శ్రీనివాస్ స్వామి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సి.అశోక్, సంయుక్త కార్యదర్శి సి.వెంకటయ్య, అనిల్, జగదీశ్, ఆశప్ప, మహేశ్, నర్సింహులు, మోహన్, బాలకృష్ణ, పకీరప్ప వీరేశం, మహిపాల్, బాలప్ప తదతరులు పాల్గొన్నారు.

'పరిగి' అభివృద్ధికి రూ.41 కోట్లు


త్వరలో సీఎం చేతుల మీదుగా శంకుస్థాపనలు

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

5

ఒక కుటుంబం పరిధిలోకి వచ్చే వారందరి వివరాలు ఒకచోట ఉండేలా ఫ్యామిలీ డిజిటల్ కార్డు పంపిణీ చేసేందుకు సర్కారు శ్రీకారం చుట్టింది. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన తొమ్మిది ప్రాంతాల్లో అధికారులు నేటి నుంచి ఆరు రోజుల పాటు సర్వే చేపట్టనున్నారు. ఈ క్రమంలో సర్వే బృందాలు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించనున్నాయి. పథకాల అర్హతగా కాకుండా పేద, ధనిక, ఉద్యోగులు, నిరుద్యోగులు అనే తేడా లేకుండా ప్రతి కుటుంబానికీ వర్తించే విధంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డులు జారీ చేయనున్నారు.

నేటి నుంచి ఇంటింటి సర్వే



- పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలో 9 ప్రాంతాలు ఎంపిక
- బృందాల వారీగా అధికారుల పర్యటన
- పర్యవేక్షణకు నియోజకవర్గానికి ఒక ప్రత్యేకాధికారి
- ఈనెల 8వ తేదీ వరకు కొనసాగనున్న సర్వే

ఫ్యామిలీ డిజిటల్ కార్డులకు వివరాల సేకరణ

వికారాబాద్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): ఫ్యామిలీ డిజిటల్ కార్డులు జారీ చేసేందుకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో వికారాబాద్ జిల్లాలో నేటి నుంచి 8తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. ఇంటింటికి తిరిగి కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు సేకరించనున్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఒక్కో నియోజకవర్గానికి రెండు ప్రాంతాలను ఎంపిక చేయాల్సి ఉండగా, జిల్లాలో నాలుగు నియోజకవర్గాల పరిధిలో మొత్తం తొమ్మిది ప్రాంతాలను ఎంపిక చేశారు. వికారాబాద్ నియోజకవర్గంలో వికారాబాద్ మునిసిపాలిటీ పరిధిలో 12 వార్డు, మర్పల్లి మండలంలో కుడుగుంట గ్రామం ఎంపిక చేశారు. తాండూరు నియోజకవర్గంలో తాండూరు మునిసిపల్ పరిధిలో 1వ వార్డు, యాలాల్ మండలంలో పగిడిపల్లి గ్రామం ఎంపిక చేశారు. పరిగి నియోజకవర్గంలో దోమ మండలంలో ఖమ్మం నాచారం గ్రామం, పరిగి మునిసిపల్ పరిధిలో 13వ వార్డు ఎంపిక చేశారు. కొడంగల్ నియోజకవర్గంలో కొడంగల్ మునిసిపల్ పరిధిలో8వ వార్డును ఎంపిక చేయగా, గ్రామ పంచాయతీని మాత్రం నారాయణ పేట జిల్లా పరిధిలోకి వచ్చే మండలాన్ని ఎంపిక చేశారు.

అన్నింటికీ ఉపయోగపడేలా..

వ్యక్తిగతంగా ఒక్కో వ్యక్తి గుర్తింపునకు ఆధార్ కార్డు ఏ విధంగా ఉన్నదో కుటుంబానికి సంబంధించి అన్నింటికి ఉపయోగపడే విధంగా డిజిటల్ కుటుంబ గుర్తింపు కార్డు జారీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఒక కుటుంబం పరిధిలోకి వచ్చే వారందరి వివరాలు ఉండేలా ఫ్యామిలీ డిజిటల్ కార్డు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. పైలెట్ ప్రాజెక్టు సర్వే ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డులు జారీ చేయనున్నారు. ప్రతి కుటుంబానికి ఒక డిజిటల్ కార్డు జారీ చేయనున్నారు. పథకాల అర్హతగా కాకుండా పేద, ధనిక, ఉద్యోగులు, నిరుద్యోగులు అనే తేడా లేకుండా ప్రతి కుటుంబానికి వర్తించే విధంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డులు జారీ చేయనున్నారు.

పకడ్బందీగా వివరాల సేకరణ

ఎంపిక చేసిన గ్రామాలు, వార్డుల్లో ఇంటింటి సర్వే నిర్వహించేందుకు మొదట ఒక్కో బృందం ఏర్పాటు చేయనున్నారు. మునిసిపాలిటీల పరిధిలో ఒక్కో బృందంలో మునిసిపల్ కమిషనర్, వార్డు అధికారి, అంగన్‌వాడీ టీచర్, మెప్మారిసోర్స్ పర్సన్ ఉండనున్నారు. అదే గ్రామ పంచాయతీల్లోనైతే ఎంపీడీవో/తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్, ఐకేపీ సీసీ ఉంటారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాల్లో ఇంటింటి సర్వే పకడ్బందీగా కొనసాగే విధంగా పర్యవేక్షించేందుకు నియోజకవర్గానికి ఒక ప్రత్యేకాధికారిని నియమించారు. కొడంగల్ నియోజకవర్గానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లింగ్యానాయక్, వికారాబాద్ నియోజకవర్గానికి అదనపు కలెక్టర్ (స్థానికసంస్థలు) సుధీర్, తాండూరు నియోజకవర్గానికి అక్కడి సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, పరిగి నియోజకవర్గానికి వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర తమ పరిధిలో జరిగే సర్వేను పర్యవేక్షించనున్నారు. సర్వే ప్రక్రియను పరిశీలిస్తూ.. సిబ్బందికి తగిన సూచనలు చేయనున్నారు. తొలిరోజు నిర్వహించే సర్వే ఆధారంగా తమకు కేటాయించిన గ్రామం, వార్డులో ఉన్న కుటుంబాలను ఎన్ని రోజుల్లో సర్వే చేయగలమనేది అంచనా వేసిన తరువాత అందుకనుగుణంగా ఎన్ని బృందాలను నియమించాలనే విషయమ్మై నియోజకవర్గాల ప్రత్యేకాధికారులు నిర్ణయం తీసుకోనున్నారు. సర్వే నిర్వహించే గ్రామాలు, వార్డుల్లో గుర్తించిన కుటుంబాల కంటే ఎక్కువ, తక్కువ కుటుంబాలు ఉండే అవకాశం ఉంది.

సర్వేకు గుర్తించిన ప్రాంతాలు

నియోజకవర్గం	ప్రాంతం	కుటుంబాలు
వికారాబాద్	మునిసిపాలిటీ - 12వ వార్డు	232
	మర్పల్లి మండలం, కుడుగుంట	110
తాండూరు	మునిసిపాలిటీ - 1వవార్డు	254
	యాలాల్ మండలం, పగిడిపల్లి	201
పరిగి	మునిసిపాలిటీ - 13వ వార్డు	245
	దోమ మండలం, ఖమ్మం నాచారం	110
కొడంగల్	మునిసిపాలిటీ - 8వ వార్డు	304

(నారాయణపేట జిల్లాలోని ఓ గ్రామం ఎంపిక)

మార్పులు, చేర్పులు కూడా..

తమకు కేటాయించిన మునిసిపల్ వార్డు, గ్రామపంచాయతీ పరిధిలో సర్వే బృందాలు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తాయి. కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేసుకోవడమే కాకుండా మార్పులు, చేర్పులు, తొలగింపులు ఉంటే నమోదు చేసుకోనున్నారు. ఇది వరకు కుటుంబాల్లో నమోదైన వారిలో వివాహమ్మై కొత్తగా వచ్చిన యువతులు, జన్మించిన పిల్లల వివరాలు నమోదు చేసుకోనున్నారు. కుటుంబ సభ్యుల్లో ఎవరైనా చనిపోతే వారి వివరాలను తొలగించనున్నారు. కుటుంబంలో నమోదై వివాహమ్మై ఇతర ప్రాంతాలకు వెళ్లిన యువతుల వివరాలు తొలగించనున్నారు. డిజిటల్ కార్డులు జారీ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్న ఈ సమయంలో ఒకసారి తమ వద్ద ఉన్న సమాచారాన్ని ధ్రువీకరించుకునేందుకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఇంటింటి సర్వే నిర్వహించాలని నిర్ణయించింది.

శాంతి, సామరస్యంతో సమస్యలు పరిష్కారం

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, అక్టోబరు 2 : భారత జాతిపిత మహాత్మాగాంధీ చూపిన శాంతి, సామరస్యం ద్వారా ఏ సమస్యలు అయినా పరిష్కరించుకోవచ్చని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. వికారాబాద్ కలెక్టరేట్‌లో బుధవారం మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని బాపూజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛతలో భాగంగా పట్టణాలు, గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిక్షించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్‌డీవో వాసుచంద్ర, జిల్లా పౌర సంబంధాల అధికారి చెన్నమ్మ, శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, ఎస్సీ కార్పోరేషన్ బాబు మోజస్, పాల్గొన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి కుటుంబానికి ఒక డిజిటల్ కార్డు ఇవ్వాలని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకఅర్బన్ వార్డు, గ్రామపంచాయతీని పైలెట్ ప్రాజెక్ట్‌గా సర్వే బృందాలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పర్యవేక్షక బృందాలకు శిక్షణ అందించారు. శిక్షణకు సంబంధించిన వివరాలను మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించారు. ఈ బృందాలు క్షేత్రస్థాయిలో సర్వేను ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సుధీర్, ట్రైనీ కలెక్టర్ ఉమా హారతి, ఆర్‌డీవో వాసుచంద్ర, తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, ఎంపీడీవోలు, కమిషనర్లు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.


గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్


నివాళులర్పిస్తున్న డీఆర్‌వో హరిప్రియ

మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్‌లో

మేడ్చల్ (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ ముఖ్య అతిథిగా పాల్గొని జిల్లా కలెక్టరేట్ అధికారులు, సిబ్బందితో కలిసి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మహనీయుని గొప్పదనాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సాంబశివరావు, జిల్లా హార్టికల్చర్ అధికారి శ్రీధర్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ పి.సుధాకర్, జిల్లా సంక్షేమ, మైనార్టీ అధికారి వీణ, కలెక్టరేట్ ఏవో రాంమోహన్ పాల్గొన్నారు. అంతేకాకుండా మేడ్చల్‌జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కార్యాలయం ప్రధానకూడలిలో గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే మల్లారెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి స్వచ్ఛత అభియాన్‌లో భాగంగా వీధులను శుభ్రం చేశారు.


గాంధీకి నివాళులు అర్పిస్తున్న స్పీకర్‌ప్రసాద్‌కుమార్

యూరప్‌లో స్పీకర్ నివాళి

తెలంగాణ శాసనసభ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విదేశీ పర్యటనలో భాగంగా స్విట్జర్లాండ్‌లో పర్యటిస్తున్నారు. ఈక్రమంలో బుధ వారం గాంధీ జయంతిసందర్భంగా మహాత్ముడి చిత్ర పటం వద్ద నివాళులు ఆర్పించారు. యూరోప్‌లోని అత్యధిక ఎత్తైన ప్రాంతం ఆల్ప్స్ పర్వతాలలో జంగ్ ప్రాజాచ్ వద్ద గాంధీకి జయంతి సందర్భంగా నివాళులు ఆర్పించారు. స్పీకర్ తన స్నేహితులతో కలిసి యూరప్‌కు వ్యక్తిగత పర్యటనపై వెళ్లారు.

ప్రభుత్వ భూమిలో ప్రహరీ నిర్మాణం

- అడ్డుకున్న అంతారం గ్రామస్తులు

తాండూరు రూరల్, అక్టోబరు 2: ప్రభుత్వ భూమిని కబ్జా చేసి చేపట్టిన ప్రహరీ నిర్మాణాన్ని గ్రామస్తులు అడ్డుకున్నారు. తాండూరు మండలం అంతారం గ్రామ పరిధిలో ప్రభుత్వ భూమిలో ఓ క్రషర్ కంపెనీ కొనసాగుతుంది. పక్కనే ఉన్న సర్వే నంబర్-58 భూమిపై క్రషర్ యజమానులు కన్నేశారు. ఆ భూమిని యంత్రాలతో చదును చేయించి గోడ నిర్మాణ పనులు కూడా చేపట్టారు. గతంలో ప్రభుత్వం దళితులకు ఇచ్చిన అసైన్డ్ భూమి ఆరు ఎకరాల వరకు కొనుగోలు చేసి ప్రస్తుతం 15ఎకరాల వరకు కబ్జాకు పాల్పడ్డారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. స్టోన్ క్రషర్‌ను సైతం అసైన్డ్ భూమిని కొనుగోలు చేసి పట్టా చేసుకున్నారని స్థానికులు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని అంతారం గ్రామస్తులు కోరుతున్నారు. పనులు అడ్డుకున్న వారిలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ శాంతు, కోస్గి ఆశన్న, జంగాని మొగులప్ప, సంఘం శ్రీనివాస్ తుమ్మలపల్లి మాణిక్యం, బెగర్ వెంకటి పలువురు గ్రామస్తులు ఉన్నారు.


ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న గోడను అడ్డుకుంటున్న గ్రామస్తులు

సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలి

పెద్దేముల్, అక్టోబరు 2 : ఒక సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని పెద్దేముల్ ఎస్ఐ.గిరి పేర్కొన్నారు. గాపాల్‌పూర్ గ్రామంలో బుధవారం ఓ కార్యక్రమంలో మాట్లాడతూ సీసీ కెమెరాలు ఏర్పాటుకు గ్రామస్తులు ముందుకు రావాలన్నారు. వీటితో దొంగలను పట్టుకోవడం సులువన్నారు. సీసీ కెమెరాలు ఉంటే దొంగతనం చేయడానికి భయపడతారని చెప్పారు. గ్రామస్తులంతా కలిసి సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకుంటే ఉపయోగకరంగా ఉంటుందని వారికి సూచించారు. దీంతో చందాలు వేసుకుని కెమెరాలు ఏర్పాటు చేసుకుంటామని గ్రామ ప్రజలు తెలిపారు.



మాట్లాడుతున్న పల్నాటి నరేశ్

'స్థానిక' ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి

బీసీ, ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక అధ్యక్షుడు పల్నాటి నరేశ్

మహేశ్వరం, అక్టోబరు 2: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కులగణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పల్నాటి నరేశ్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని నాగారం గ్రామంలో ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు రాజకీయాలకు అతీతంగా హక్కుల సాధనకోసం ఏకం కావాలన్నారు. త్వరలో మహేశ్వరంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ హక్కుల సాధన కోసం మహేశ్వరంలో భారీ బహిరంగ సభ ఉంటుందని ఈ సభ విజయవంతానికి అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాజు, నవీన్, వెంకటేష్, శ్రీకాంత్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌ల నమోదులో మార్పులు

మేడ్చల్ అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఎస్సీ విద్యార్థుల పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ నమోదుకు సంబంధించి మార్పులు చేసి నూతన విధివిధానాలు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిందని ఎస్సీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి జీవినోద్‌కుమార్ తెలిపారు. నూతన మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ పాస్ వెబ్‌సైట్లో మార్పు చేశారని, దీని ప్రకారం అర్హులైన ఎస్ఎస్‌సీ మెమో మాదిరిగానే ఆధార్‌లో కూడా ఉండాలన్నారు. అలాగే విద్యార్థి కుటుంబ ఆదాయ పరిమితి రూ. 2 లక్షల నుంచి రూ. 2.50 లక్షలకు పెంచినట్లు ఆయన తెలిపారు. విద్యార్థి ఎస్ఎస్‌సీ మెమోలో పొందుపరిచిన వివరాలు, ఆధార్ వివరాలతో సరిపడని యెడల దగ్గరిలోని మీసేవా కేంద్రంలో ఆధార్ వివరాలు సరి చేసుకోవాలని సూచించారు. ఈ మార్పునకు సంబంధించిన విషయాలను జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ కళాశాల ప్రధానాచార్యులు ఈ నమోదు ప్రక్రియపై అవగాహన కలిపించాలని వినోద్‌కుమార్ సూచించారు.

కంపుకొడుతున్న 'షాబాద్'!

- ఎక్కడపడితే అక్కడ చెత్త కుప్పలు
- పట్టించుకోని అధికారులు



షాబాద్ మండల కేంద్రంలో చెత్తకుప్ప

షాబాద్, అక్టోబరు 2: షాబాద్ మండల కేంద్రంలో ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. అటుగా వెళ్లాలంటనే స్థానికులు ముక్కు మూసుకోవాల్సిన దుస్థితి. ప్రత్యేక అధికారుల పాలనలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా గ్రామంలో చెత్త సేకరణ చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త కారణంగా దోమలు వ్యాప్తి చెందుతున్నందున అధికారులు తక్షణం స్పందించి వెంటనే చెత్త కుప్పలను తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. కాగా, మండల కేంద్రంలో డంపింగ్ యార్డు లేకపోవడంతో నాలుగు రోజులుగా చెత్తను సేకరించడం లేదని పంచాయతీ కార్యదర్శి అనిత తెలిపారు. బుధవారం డంపింగ్ యార్డు స్థలపరిశీలన జరిగింది. అందువలన నేటి నుంచి చెత్తను సేకరించి డంప్‌యార్డుకు తరలిస్తామన్నారు.



బస్టాండ్ ఆవరణలో..

'పరిగి' అభివృద్ధికి రూ.41 కోట్లు

- త్వరలో సీఎం చేతుల మీదుగా శంకుస్థాపనలు
- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



పరిగిలో వీధిని శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తదితరులు

పరిగి, అక్టోబరు 2: పరిగి మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.41 కోట్లు మంజూరయ్యాయని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్వచ్ఛాహీ సేవలో భాగంగా పరిగి పట్టణంలో ఎన్‌సీసీ విదార్థులతో కలిసి వీధులను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.5 కోట్ల నిధులతో మున్సిపాలిటీ భవనాన్ని నిర్మిస్తామని తెలిపారు. రూ.20 కోట్లతో 15 వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపడతామని తెలిపారు. రూ.60 లక్షలతో మున్సిపాలిటీకి స్వాగతం పలికే ఆర్చుల నిర్మాణానికి వినియోగిస్తామన్నారు. రూ.16 కోట్లతో పట్టణంలో వాటర్ ట్యాంకుల నిర్మాణం, పైపులైన్‌ల ఏర్పాటు చేసి శాశ్వత మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పరిగి మీదుగా రైల్వేలైను ఏర్పాటుకు మంజూరి వచ్చిందని తెలిపారు. రూ.2500 కోట్లతో ఏర్పాటు చేయనున్న నేవీ రాడార్ ప్రాజెక్టుకు పూడూరు దామగుండంలో శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అలాగే అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు రూ.800 కోట్లతో చేపట్టనున్న నాలుగులైన్ రహదారి పనులు ప్రారంభిస్తారని తెలిపారు.

గిట్టనివారి అసత్య ప్రచారం

పరిగి ప్రభుత్వ అస్పత్రిని రూ.20 కోట్లతో అభివృద్ధి చేస్తామని తెలిపారు. నేవీ రాడార్ స్టేషన్‌తో ఎవరికి ముప్పు ఉండదన్నారు. అడవిలో చెట్లను నరకరని, కొద్ది భూభాగంలో రాడార్ స్టేషన్ ఏర్పాటు జరుగుతుందని తెలిపారు. చెట్లు, జంతువులకు ఏలాంటి ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు. అభివృద్ధి గిట్టని కొందరు స్వార్థపరులు అసత్య ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని మండిపడ్డారు. ఈ రాడార్ స్టేషన్ వల్ల టౌన్‌షిప్ ఏర్పాటు అవుతుందని, పిల్లలకు ఇంటర్నేషనల్ స్కూల్, ఆస్పత్రిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ అన్ని అభివృద్ధి పనులకు త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపనలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ ఎం.అశోక్, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి కె.హణ్మంత్‌ముదిరాజ్, మండల పార్టీ అధ్యక్షుడు పరుశరాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బలవంతపు మత మార్పిళ్లను సహించం

- హిందూ వాహిని రాష్ట్ర కన్వీనర్ విశ్వప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వప్రసాద్

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 2: బలవంతపు మత మార్పిడులను సహించేది లేదని హిందూ వాహిని రాష్ట్ర కన్వీనర్, లీగల్ సెల్ ఇన్‌చార్జి విశ్వప్రసాద్ హెచ్చరించారు. బుధవారం ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇబ్రహీంపట్నం కేంద్రంగా ఓ సంస్థ విద్యార్థులను ప్రలోభాలకు గురిచేస్తూ బలవంతపు మత మార్పిడులకు పోత్సహిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ తరగతుల పేరుతో ఓ వర్గానికి చెందిన సంస్థ ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులను సమావేశపరిచి హిందూ మతంపై తప్పుడు ప్రచారం చేస్తూ మత మార్పిడిలకు పాల్పడుతోందన్నారు. సెప్టెంబరు 28న ఇక్కడ జరుగుతన్న మత మార్పిడిలను ప్రశ్నించిన హిందూ వాహిని కార్యకర్తలపై భౌతిక దాడులకు పాల్పడడమేగాక కేసులు నమోదు చేయాలని ఆ సంస్థకు చెందిన పెద్దలు ప్రయత్నాలు చేస్తున్నారని దీనిని హిందూ వాహిని తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఎవరైనా ఇష్ట ప్రకారం మత మార్పిడి చేసుకుంటే తాము వ్యతిరేకించమన్నారు. కానీ సమాజంలో చీలికలు తేవడానికి బలవంతపు మత మార్పిడులకు పాల్పడితే మాత్రం సహించేది లేదన్నారు. సమావేశంలో హిందూ వాహిని లీగల్ సెల్ కో కన్వీనర్ గురువయ్యాగౌడ్, ప్రాంత కమిటీ సభ్యుడు శ్రీనివాస్, ఆర్ఎస్ఎస్ నగర సంఘచాలక్ ఎస్.అంజన్‌రెడ్డి తదితరులున్నారు.

గిరిజనులకు అన్ని రంగాల్లో అన్యాయం


- ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినా తీరని బాధలు
- డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్ నాయక్



మాట్లాడుతున్న డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్ నాయక్

ఆదిభట్ల, అక్టోబరు 2 : సామాజిక, ఆర్థిక, రాజకీయ ఇలా అన్ని రంగాల్లోనూ గిరిజనులకు తీరని అన్యాయం జరుగుతుందని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచందర్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగ్లూర్‌లోని కళ్లెంజంగారెడ్డి గార్డెన్‌లో ట్రైబల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రైబల్ టీచర్స్ ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో కంటే సొంత రాష్ట్రంలోనే గిరిజనులు ఎక్కువ నష్టపోయారని అన్నారు. పేద గిరిజనలుండే చోట ఉండాల్సిన దాదాపు 4 వేలకు పైగా ఏకోపాధ్యాయ పాఠశాలలు మూతపడ్డాయన్నారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఏకోపాధ్యాయ పాఠశాలలను మళ్లీ తెరిపించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించుకుంటున్నామన్నారు. రానున్న రోజుల్లో గిరిజన ఉపాధ్యాయులే యువతను మంచి మార్గంలో నడిపించాలని ఆయన కోరారు. బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ గిరిజన ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. భవిష్యత్ తరాలకు మార్గదర్శకులు ఉపాధ్యాయులేనన్నారు.

సాహితీ పురస్కారానికి డాక్టర్ భాస్కరయోగి ఎంపిక



పరిగి, అక్టోబరు 2: పరిగి పట్టణానికి చెందిన రచయిత, సామాజిక విశ్లేషకులు డాక్టర్ పి.భాస్కరయోగి సాహితీ పురస్కారానికి ఎంపికయ్యారు. తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ధర్మనిధి సాహితీ పురస్కారాల ప్రదానోత్సం ఈ నెల 4న నగరంలోని అబిడ్స్ పరిధిలోని డాక్టర్ దేవులపల్లి రామాజరావు కళామందిరంలో జరుగనుంది. పరిగికి చెందిన భాస్కరయోగి ఆచార్య పాకాల యశోధారెడ్డి సాహితీ పురస్కారాన్ని అందుకోనున్నారు. సాహితీవేత్త, సినీనటులు డాక్టర్ తనికెళ్ల భరణి, తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఎల్లూని శివారెడ్డి, తదితరులు అవార్డును అందజేయనున్నారు.

ఊళ్లకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న కాంతారెడ్డి

షాబాద్, అక్టోబరు 2 : పండుగల సందర్భంగా ఊళ్లకు వెళ్లే సమయంలో ప్రతీఒక్కరూ దొంగతనాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని షాబాద్ ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పండుగ సమయంలో ఊరు వెళ్లాల్సివస్తే బంగారు, వెండి ఆభరణాలు, డబ్బులు బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలని, లేనిచో ఇంట్లోనే రహస్య ప్రదేశాల్లో ఉంచుకోవాలన్నారు. తాళం వేసి ఊరు వెళ్లాల్సి వస్తే పోలీస్ స్టేషన్‌లో తప్పకుండా సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామంలో, కాలనీలో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. బైక్‌లకు తాళాలు వేసి, ఇంటి ఆవరణలోనే పార్కు చేయాలన్నారు. నమ్మకమైన వాచ్‌మెన్‌లను మాత్రమే నియమించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు నవీన్‌రెడ్డి, సతీష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలకృష్ణ కుటుంబానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి పరామర్శ

మంచాల, అక్టోబరు 2: ఇటీవల కలెక్టరేట్‌లో తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడిన కానిస్టేబుల్ దూసరి బాలకృష్ణ కుటుంబాన్ని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి బుధవారం పరామర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద రైతు కుటుంబానికి చెందిన బాలకృష్ణ అర్థంతరంగా తనువు చాలించడం.. ఆ తల్లిదండ్రులకు గర్భశోకాన్ని మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వ పరంగా న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఆయన కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు.



బోటింగ్ చేస్తున్న నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్

'కోట్‌పల్లి'లో కలెక్టర్ సందడి

మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టులో నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ కుటుంబసభ్యులతో కలిసి బుధవారం సందడి చేశారు. ఈ సందర్భంగా ఆమె ప్రాజెక్టు పరిసరాల్లోని ప్రకృతి అందాలను తిలకించారు. కుటుంబ సభ్యులతో కలిసి ప్రాజెక్టు నీటిలో సరదాగా బోటింగ్ చేశారు.

-ధారూరు, అక్టోబరు 2



వర్ష, కొడంగల్



భరద్వాజ్, టేకుల్‌కోడ్



దీక్షిత్, పెద్ద నందిగామ

టాప్ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్ల సాధన

కొడంగల్ రూరల్, అక్టోబరు 2: నీట్ పరీక్షలో ఉత్తమ ర్యాంకులు సాధించిన స్థానిక అభ్యర్థులు కౌన్సెలింగ్‌లో ఉత్తమ కళాశాలల్లో సీట్లు సాధించారు. కొడంగల్ పట్టణానికి చెందిన లహోటి వర్ష 3,973 నీట్ ర్యాంకు(690 మార్కులు)తో, టేకుల్‌కోడ్ గ్రామానికి చెందిన సి. భరద్వజ్ 32,433 ర్యాంక్(643 మార్కులు)తో ఇద్దరూ నగరంలోని గాంధీ మెడికల్ కాలేజీలో కన్వీనర్ కోటాలో సీటు సాధించారు. అలాగే మండల పరిధిలోని పెద్ద నందిగామ గ్రామానికి చెందిన కొత్తపేట దీక్షిత్ 65,089 ర్యాంకు(611 మార్కులు)తో మహబుబ్‌నగర్ ప్రభుత్వ వైద్యకళాశాలలో కన్వీనర్ కోటాలో సీటు సాధించారు. దీంతో వారి కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామస్తులు అభినందించారు.



నూతన కార్యవర్గ సభ్యులతో పుట్ట లక్ష్మణ్

స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

షాద్‌నగర్అర్బన్, అక్టోబరు 2: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. షాద్‌నగర్ విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో బుధవారం నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ షాద్‌నగర్ కౌన్సిల్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావ్యవస్థపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను భ్రష్టుపట్టించిందని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను అభివృద్ధి వైపు నడిపిస్తూ, పెండింగ్ స్కాలర్‌షిప్‌లను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ షాద్‌నగర్ కౌన్సిల్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా నరేశ్, కార్యదర్శిగా విజయ్, ఉపాధ్యక్షులుగా రమేశ్, పూజ, సహాయ కార్యదర్శులుగా తరుణ్, నందిని, కోశాధికారిగా సాయిలను ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు గ్యార క్రాంతి, వంశీవర్ధన్‌రెడ్డి, పవన్ చౌహాన్, అకాష్, అరుణ్, శివ తదితరులు పాల్గొన్నారు.



వ్యర్థాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

వ్యర్థాలతోనూ ఆర్థిక లాభాలు

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, అక్టోబరు 2: వ్యర్థాలను సక్రమంగా వినియోగించుకుంటే ఆర్థికపరంగా ఎన్నో లాభాలు సాధించవచ్చని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఫరూఖ్‌నగర్‌లో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన దాణా తయారీ వర్మి కంపోస్ట్ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూరగాయల వ్యర్థాల నుంచి చేపలు, కోళ్ల దాణా తయారు చేయడం హర్షణీయమన్నారు. వర్మి కంపోస్ట్ నీటిలో ఉండే పోషకాలతో సేంద్రియ ఎరువులతో పాటు మురుగు నీటిని కూడా శుభ్రం చేయవచ్చని తెలిపారు. మారుతున్న కాలానికి తగ్గట్టుగా వ్యర్థాలను కూడా మానవ జీవన ప్రమాణాలకు అనుగుణంగా మార్చుకునే ప్రక్రియలు ఎన్నో వస్తున్నాయని అందులో భాగంగానే వర్మి కంపోస్ట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, కమిషనర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

వెలిజర్లలో బెల్ట్‌షాప్‌లను నిషేధించాలి

షాద్‌నగర్‌రూరల్, అక్టోబరు 2: తమ గ్రామంలో బెల్ట్ షాపులను నిషేధించాలని మండల పరిధిలోని వెలిజర్ల గ్రామస్తులు బుధవారం గ్రామ కార్యదర్శి యాదయ్యకు వినతి పత్రం ఇచ్చారు. విచ్చల విడిగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారని యువకులు మద్యానికి బానిసగా మారి ఆరోగ్యాలు పాడు చేసుకుం టున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తెల్లవారు జామున 4.00 గంటల నుంచి రాత్రి 12.00 గంటల వరకు మద్యం విక్రయాలు జరుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా విచ్చలవిడిగా మద్య దొరుకుతుండటంతో మైనర్లు కూడా మద్యానికి బానిసలవుతున్నారని మండిపడ్డారు. అన్ని కిరాణా షాపుల్లో మద్యం విక్రయాలు జరుపుతున్నారని తెలిపారు. ఎక్సైజ్ అధికారుల అండదండలతోనే ఈ మద్యం విక్రయాలు జోరుగా జరుగుతున్నట్లు ఆరోపించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు జంగయ్య, శ్రీనివాస్, కుమార్, వెంకటేష్, ప్రవీణ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

శంకర్‌పల్లి, అక్టోబరు 2: మౌలిక సదుపాయాల కల్పనకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. మోకిల-టంగటూరు గ్రామాల మధ్య గల మూసీ నదిపై నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిని ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పనులు నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తానని చెప్పారు. ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చనున్నట్లు ఆయన తెలిపారు.

'శంకర్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి'

శంకర్‌పల్లి, అక్టోబరు 2: మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చైర్‌పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శంకర్‌పల్లి మున్సిపాలిటీలోని 13వ వార్డులో జరుగుతున్న అంతర్గత మురుగుకాలువ పనులను ఆమె బుధవారం పరిశీలించారు. పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సహకారంతో పట్టణాన్ని మరింత అభివృద్ధి పరుస్తానని చెప్పారు. వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్ చంద్రమౌళి, కో-ఆప్షన్ సభ్యుడు మైమూద్, నాయకుడు తౌఫిక్ ఉన్నారు.


వికారాబాద్‌లో గాంధీ విగ్రహానికి, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గాంధీ చూపిన మార్గంలో నడుద్దాం

జాతిపిత మహాత్మాగాంధీ చూపిన మార్గంలో మనమంతా నడుచుకోవాలని నేతలు, నాయకులు, అధికారులు, మేధావులు అన్నారు. బుధవారం గాంధీ జయంతిని ప్రభుత్వ, రాజకీయ పార్టీల కార్యాలయాలు, గ్రామాలు, పట్టణాల్లో ఘనంగా నిర్వహించారు. గాంధీజీ విగ్రహాలకు, చిత్రపటాలకు నివాళులు అర్పించారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో మహాత్ముడు చేసిన కృషిని ఈ సందర్భంగా నాయకులు కొనియాడారు. స్వేచ్ఛాయుత సమసమాజ నిర్మాణానికి గాంధీజీ పాటుపడ్డారన్నారు. ఆయన చూపిన మార్గంలో మనమంతా నడుచుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. అలాగే మాజీ ప్రధాని లాల్‌బహద్దూర్‌శాస్త్రీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటాలకు నివాళులు అర్పించారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు నిర్వహించారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, అక్టోబరు 2


కీసర రూరల్: దమ్మాయిగూడలో గాంధీజీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న చైర్‌పర్సన్ ప్రణీత తదితరులు


ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయం వద్ద గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న చైర్‌పర్సన్ పావని, కౌన్సిలర్లు, కార్యాలయ సిబ్బంది


కొడంగల్: రుద్రారంలో గాంధీ జయంతిలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంద్‌రెడ్డి


తాండూరు రూరల్: అంతారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీవో విశ్వప్రసాద్, మహిళలు


పరిగిలో గాంధీజీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు


మేడ్చల్ టౌన్: గుండ్లపోచంపల్లిలో రోడ్డు ఊడుస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి


కులకచర్లలో పారిశుధ్య కార్మికులకు సన్మానం


తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సబ్ కలెక్టర్


యాలాలలో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


వికారాబాద్: గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు


తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, కమిషనర్ వెంకటగోపాల్


ఘట్‌కేసర్ రూరల్: తెనుగూడెంలో గాంధీవిగ్రహ అవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు


కీసరలో గాంధీ విగ్రహం ఆవిష్కరించి, జయంతి వేడుకలు నిర్వహించిన గ్రామస్తులు

ఖైదీలు పరివర్తన చెందాలి

పరిగి, అక్టోబరు 2: కేసుల్లో ఇరుక్కున్న ఖైదీలు పరివర్తన చెందాలని పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి అన్నారు. బుధవారం గాంధీజయంతి, ఖైదీల సంక్షేమ దినోత్సవం సందర్భంగా డీఎస్పీ, డాక్టర్ ప్రవీణ్ సబ్‌జైలును సందర్శించారు. ఆటల, పోటీల్లో ప్రతిభ చాటిన ఖైదీలకు బహుమతులు అందజేశారు. చేసిన తప్పులు తలచుకొని బాధపడే కంటే భవిష్యత్తు గురించి ఆలోచించుకొని మసలుకోవాలన్నారు. జైలు నుంచి విడుదలైన తర్వాత సత్ప్రవర్తనతో నడుచుకోవాలన్నారు. జైలు సూపరిండెంట్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఖైదీలకు నాణ్యమైన భోజనం, విద్య అందిస్తున్నామన్నారు. అహింసా మూర్తి మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నడుచుకోవాలన్నారు. ప్రభుత్వం జైళ్లలో కూడా అనేక సంస్కరణలు తీసుకవచ్చిందని, అయితే ఎవరైనా కేసుల జోలికి వెళ్లకుండా ప్రశాంత జీవితాన్ని అనుభవించాలన్నారు. కార్యక్రమంలో హెడ్‌వార్డర్ విశ్వనాథరావు, వార్డర్స్ శ్రీను, పరమయ్య, హరికృష్ణ, పాల్గొన్నారు.

క్రీడల్లో అవకాశాలను యువత వినియోగించుకోవాలి


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సుధాకర్‌రెడ్డి

వికారాబాద్, అక్టోబరు 2: క్రీడారంగంలో వచ్చే అవకాశాలను యువత వినియోగించుకోవాలని మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ అర్ధ సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వికారాబాద్‌లోని బ్లాక్ గ్రౌండ్స్‌లో అండర్-14 క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు రెడ్యానాయక్, కౌన్సిలర్ వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, నిర్వాహకులు, విద్యార్థులు, పలువురు పీఈటీలు పాల్గొన్నారు.

డీసీసీబీ డైరెక్టర్‌కు సన్మానం

నూతనంగా డీసీసీబీ డైరెక్టర్‌గా నియమితులైన కిషన్‌నాయక్‌ను మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి సన్మానించారు. పీఏసీఎస్ చైర్మన్‌గా అనుభవం ఉన్న కిషన్ నాయక్‌ను పార్టీ డీసీసీబీ డైరెక్టర్‌గా నియమించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ముత్తాహర్‌షరీఫ్, రెడ్యానాయక్, కౌన్సిలర్లు వేణుగోపాల్‌రెడ్డి, మురళి, శ్రీనివాస్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం


సత్యనారాయణను కలిసిన ఎంపీ రాజేందర్

కీసర రూరల్, అక్టోబర్ 2: ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటామని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం నాగారం పరిధిలో నివసిస్తున్న జాతీయ కార్యవర్గ మాజీ సభ్యుడు సత్యనారాయణను ఆయన కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎంపీతో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్, తిరుమల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి ఉన్నారు.

యువతను ప్రభుత్వం ఆదుకుంటుంది

కులకచర్ల, అక్టోబరు 2: యువతకు ప్రభుత్వం అండగా ఉండి ఆదుకుంటుందని తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మనోహర్‌రెడ్డి స్వగ్రామం తిరుమలాపూర్‌కు వచ్చారు. గ్రామ యువకుడు ఉత్తమ్‌కుమార్ అరుణచాలం నుంచి తెప్పించిన ఇసుకతో స్వయంగా తయారు చేసిన ఎమ్మెల్యే చిత్రాన్ని ఆయనకు అందించారు. తాను ఎక్కడ ఉన్నా తన అభిమానులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ మొగులయ్య, డైరెక్టర్లు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న యువకులు

క్రికెట్ టోర్నీలో పెద్దేముల్ జోన్ విజయం

పెద్దేముల్, అక్టోబరు 2 : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న అండర్-14 క్రికెట్ పోటీల్లో పెద్దేముల్ జోన్ క్రీడాకారులు ఘనవిజయం సాధించారు. వికారాబాద్‌లోని బ్లాక్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో బుధవారం తాండూరు జోన్, పెద్దేముల్ జోన్ విద్యార్థులు తలపడ్డారు. మొదట బ్యాటింగ్ చేసిన తాండూరు విద్యార్థులు 72 పరుగులు సాధించారు. లక్ష్య ఛేదనకు దిగిన పెద్దేముల్ విద్యార్థులు ఆరు ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 72 రన్స్ చేసి విజయం సాధించారని జోనల్ సెక్రటరీ శివప్రసాద్ తెలిపారు. గురువారం పరిగి జోన్‌తో సెమీ ఫైనల్‌లో వీరు తలపడతారని చెప్పారు.

పోలీసులకు సన్మానం


అధికారులను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్

మూడుచింతలపల్లి, అక్టోబరు 2 : పోలీసుల సేవలు వెలకట్టలేనివని జగ్గంగూడ మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. పది రోజుల క్రితం గ్రామంలో ఓ వృద్ధురాలిపై జరిగిన హత్యాయత్నం, దోపిడీ కేసును పోలీసులు నాలుగు రోజుల్లోనే ఛేదించి నిందితులను పట్టుకుని బాధితులకు న్యాయం చేశారన్నారు. దీంతో గ్రామస్తులు సీఐ శ్రీనాథ్, డీఐ గంగాధర్, ఎస్సై పరశురామ్‌నాయక్‌లను బుధవారం సన్మానించారు. గ్రామస్తులు ఇళ్ల వద్ద వద్ద సీసీ కెమరాలను ఏర్పాటు చేసుకోవాలని సీఐ సూచించారు. నేర రహిత సమాజంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సొంతంగా గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు, గ్రామస్తులు

పెద్దేముల్, అక్టోబరు 2: శిథిలమైన గాంధీవిగ్రహం స్థానంలో తాను డబ్బు వెచ్చించి కొత్త విగ్రహాన్ని త్వరలో ఏర్పాటు చేయిస్తానని మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ జితేందర్‌రెడ్డి అన్నారు. గాంధీ విగ్రహం దయనీయ స్థితిపై బుధవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తకు ఆయన స్పందించారు. పాత విగ్రహం స్థానంలో కొత్తది పెడతామన్నారు. నాయకులు, గ్రామస్తులతో కలిసి గాంధీ విగ్రహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, నాయకులు ఎల్లారెడ్డి, ప్రవీణ్‌కుమార్‌గుప్తా, రవి, రియాజ్, డివై.నర్సిములు, ఆనంద్‌చారి పాల్గొన్నారు.

మేడ్చల్‌లో పలుచోట్ల రక్తదాన శిబిరాలు

మేడ్చల్ టౌన్, అక్టోబరు 2: మేడ్చల్‌లో పలు స్వచ్ఛంద సంస్థలు బుధవారం రక్తదాన శిబిరాలు నిర్వహించాయి. ఆర్టీసీ డిపో వద్ద దారుల్ ఉలూమ్ అరేబియా ట్రస్ట్ శిబిరాన్ని నిర్వహించింది. ముస్లిం, మార్వాడీ యువకులు పెద్దఎత్తున రక్తదానం చేశారు. ఆయుష్ మాన్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీగార్డెన్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.

కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం

యాలాల, అక్టోబరు 2:కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ నాయకులు నిర్వహించారు. బుధవారం యాలాలలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య పార్టీ జెండాను ఆవిష్కరించారు. దేశంలో దళితుల పట్ల కుల వివక్ష కొనసాగుతోందన్నారు. 1998 అక్టోబరు 2న కేవీపీఎస్ ఏర్పడిందని, కుల వివక్షపై పోరాడుతున్న ఏకైక సంఘం కేవీపీఎస్ అన్నారు. అనేక పోరాటాలు చేసి విజయం సాధించామన్నారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి

పెద్దేముల్, అక్టోబరు 2: ప్రతొక్కరు పరిశుభ్రతను పాటించాలని డీఎల్‌పీవో శంకర్‌నాయక్ అన్నారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. మంబాపూర్‌లో గాంధీజీ చిత్రపటానికి డీఎల్పీవో పూలమాలలు వేశారు. అనంతరం పంచాయతీ కార్మికులను సన్మానించారు. ప్రతి వ్యక్తి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కోట్‌పల్లి ఏఎంసీ వైస్‌చైర్మన్ నారాయణరెడ్డి, ఎంపీవో రతన్‌సింగ్, పీఎస్ సంజీవ్‌కుమార్, నాయకులు వై.శ్రీనివాస్, మొయిద్, హర్షవర్ధన్‌రెడ్డి, పీటర్ యాదయ్య పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు ఉపాధ్యాయుల సన్మానం

బొంరాస్‌పేట్, అక్టోబరు 2: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన చౌదర్‌పల్లికి చెందిన రాజేశ్‌రెడ్డిని ఉపాధ్యాయులు సన్మానించారు. బుధవారం టీపీటీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, టీచర్లు రాజేశ్‌రెడ్డి దంపతులను శాలువాతో సన్మానించారు. పీఆర్టీయూ మండల అధ్యక్షుడు అనిల్‌కుమార్, నాయకులు బాకారం చంద్రశేఖర్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ డైరెక్టర్‌కు సత్కారం

వికారాబాద్, అక్టోబరు 2 : డీసీసీబీ డైరెక్టర్‌గా నియామకమైన కిషన్ నాయక్‌ను పీఆర్‌టీయూ నాయకులు సన్మానించారు. బుధవారం గాంధీ పార్కులో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ శాలువా, పూలమాలతో సన్మానించారు. మునిసిపల్ చైర్ పర్సన్ మంజుల, కేదార్‌నాథ్, సతీష్, రాఘవేంద్ర, శ్రీనివాస్, బాలు, శివకుమార్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లను ప్రారంభించిన ఎమ్మెల్యే

పూడూరు, అక్టోబరు 2 : రాకంచర్లలో మాజీ సర్పంచ్ పెంటయ్య సొంత డబ్బుతో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయించారు. ఈ లైట్లను బుధవారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ గ్రామ అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. పరశురాం, యాదయ్య ఉన్నారు.

మంత్రి ఉత్తమ్‌కు రామ్మోహన్‌రెడ్డి పరామర్శ

పరిగి, అక్టోబరు 2: నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి ఇటీవల మృతిచెందారు. బుధవారం నగరంలోని ఆయన నివాసానికి పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి వెళ్లి పరామర్శించారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

కులకచర్ల, అక్టోబరు 2: యువత అన్ని రంగాల్లో రాణించాలని కాంగ్రెస్ నాయకుడు బి.శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం కులకచర్లలో సూపర్ 8సీజన్‌లో భాగంగా మండల స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు.

ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ


మేడ్చల్ కుమ్మరిబస్తీ బతుకమ్మ ఆడుతున్న మహిళలు

మేడ్చల్(ఆంధ్రజ్యోతి)/ఘట్‌కేసర్ రూరల్/వికారాబాద్/బొంరాస్‌పేట్/కీసర/శామీర్‌పేట/ఘట్‌కేసర్, అక్టోబరు 2 : తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాన్ని ప్రతిబింబించే బతుకమ్మ పండుగ బుధవారం నుంచి ప్రారంభమైంది. మొదటి రోజు పెత్తరమాస నాడు మహిళలు ఎంగిలిపూల బతుకమ్మలు పేర్చి ఆడిపాడారు. బతుకమ్మ సంబరాల్లో మహిళలు, బాలికలు, చిన్నారులు మునిగితేలారు. మేడ్చల్ జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో బతుకమ్మ వేడుకను ఉత్సాహంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు రోజుకో పేరుతో ఈ బతుకమ్మ పండుగను నిర్వహిస్తారు. ఘట్‌కేసర్ మండల గ్రామాల్లో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. కూడళ్లలో లైట్లు, డీజే సౌండ్‌లు ఏర్పాటు చేసి బతుకమ్మ పాటలు పెట్టారు. వికారాబాద్‌లోని సిద్ధార్థ పాఠశాలలో బతుకమ్మ వేడుక నిర్వహించారు. నిర్వాహకులు గోపాలరావు, బద్రీనాథ్, ప్రిన్సిపాల్ మంజుల,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. దుద్యాలలోని నేతాజీ విద్యానికేతన్ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయినులు బతుకమ్మ వేడుక నిర్వహించారు. కరస్పాండెంట్ రాఘవేందర్‌యాదవ్, టీచర్లు శ్వేత, రఘు, అన్వర్, సాగరిక, జయశ్రీ, పద్మ పాల్గొన్నారు. బొంరాస్‌పేట్‌లోని రెయిన్‌బో పాఠశాలలో బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. టీపీటీ నాయకులు రవీందర్‌గౌడ్, గౌరారం గోపాల్, చంద్రశేఖర్, టీచర్లు బాబు, హైమద్, రాములు, పార్వతి, కవిత, స్వరూప, శ్రీవాణి, నవనీత, యాదమ్మ, శ్రీలత, అపర్ణ, సమ్రీన్ పాల్గొన్నారు. కీసరలో బతుకమ్మ వేడుకలు ప్రారంభమయ్యాయి. శామీర్‌పేట మండలంలో బతుకమ్మ ఉత్సవాలను మొదటి రోజు మహిళలు ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకున్నారు. ఎంగిలిపూల బతుకమ్మ పండుగను ఘటకేసర్, పోచారం మున్సిపాలిటీల పరిధిలో నిర్వహించారు. పట్టణంలోని బొక్కోనిగూడ చౌరస్తా వద్ద కౌన్సిలర్ బొక్క సంగీతప్రభాకర్‌రెడ్డి మహిళలతో కలిసి బతుమ్మ ఆడారు. అలాగే గురుకుల కళాశాల మైదానంలోనూ బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.


ఘట్‌కేసర్ మున్సిపాలిటీ బొక్కోనిగూడ చౌరస్తాలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


శామీర్‌పేటలోని శివాలయం వద్ద బతుకమ్మ వేడుక

సంక్షిప్తంగా...

● **మోమిన్‌పేట్:** బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ వడ్ల నందు తెలిపారు. బుధవారం మేకవనంపల్లిలో సభ్యత్వ నమోదులో పాల్గొని మాట్లాడారు. గాంధీ జయంతి సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ బీజేపీ సభ్యత్వం తీసుకొని అనుకున్న పార్టీని బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నాయకులు భుజంగారెడ్డి, ఆశిరెడ్డి, శ్రీనివాస్, పి.నితీశ్‌రెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

● **కొడంగల్:** సనాతన ధర్మ పరిరక్షణ కమిటీని కొడంగల్‌లో ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణగుప్తా, ప్రధాన కార్యదర్శులు మిఠాయి రాజు, ప్రవీణ్‌లను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. వారు మాట్లాడుతూ హిందూ సనాతన ధర్మ పరిరక్షణకు తమవంతుగా కృషిచేస్తామని తెలిపారు.

● **కులకచర్ల:** సుస్థిర పాలనకు బీజేపీలో చేరాలని పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప తెలిపారు. పుట్టపహాడ్‌లో బీజేపీ సభ్యత్వ నమోదులో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యారెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా ఇన్‌చార్జి భానుప్రకాశ్, తారాకుమార్, విజయ్ పాల్గొన్నారు.

● **తాండూరు:** స్వచ్ఛతా హీ సేవ ముగింపు సందర్భంగా తాండూరు మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్ ప్రారంభించారు. కార్మికులకు వైద్య పరీక్షలు చేశారు. అంతకుముందు జవాన్ల ఆధ్వర్యంలో జాతీయ నాయకుల విగ్రహాలను, పరికరాలను శుభ్రపరిచే కార్యక్రమాన్ని పారిశుధ్య చేపట్టారు. మున్సిపల్ డీఈ మణిపాల్, మేనేజర్ నరేందర్ రెడ్డి, శానిటరీ ఇన్‌చార్జి ఇన్స్పెక్టర్ వెంకటయ్య, కౌన్సిలర్ రామకృష్ణ, ఈఈ ప్రవీణ్‌గౌడ్, డాక్టర్లు ఆకాష్, అఖిల్, గిరిధర్, సుధాకుమారి, సుమలత, సుల్తాన్, యాదగిరి, టి.శ్రీనివాస్, తిరుపతయ్య, బాలు, రమేష్, వీరన్న పాల్గొన్నారు.

● **బొంరాస్‌పేట్:** కుటుంబ పెద్దలను కోల్పోయిన బొంరాస్‌పేట్‌కు చెందిన అరుణ, భాగ్యమ్మ, కార్తికేయ, సిద్ధు కుటుంబాలకు కిసాన్ బంధు సహకారంతో రూ.12వేలను టీపీటీ నాయకులు అందజేశారు. 12ఏళ్లుగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎంతోమంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, వారి కుటుంబాలకు, పిల్లలకు చేయూతనిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీపీటీ నాయకులు రవీందర్‌గౌడ్, బి.చంద్రశేఖర్, గోపాల్, అనిల్, శ్రీహరిరెడ్డి, కాశీపతి తదితరులు పాల్గొన్నారు.

● **శామీర్‌పేట:** సమాజంలోని ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి రక్తాన్ని దానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు పిలుపు నిచ్చారు. దేవరయంజాల్‌లోని జడ్పీ పాఠశాలలో లైఫ్ సేవర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఏసీపీ ప్రారంభించారు. ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బీటెక్ సాయి ఆధ్వర్యంలో ఆర్గనైజర్లు కలసి దాదాపు 50మంది దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. ఇన్‌స్పెక్టర్ విజయవర్ధన్, మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, కమిషనర్ వెంకటగోపాల్ పాల్గొన్నారు.

● **కొడంగల్:** అమ్మనాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొడంగల్‌లో ఓ మతిస్థిమితం లేని వ్యక్తిని చేరదీశారు. ఆ వ్యక్తి వివరాలు తెలుసుకోగా కోస్గి మండలం చెన్నారం, భీమప్ప అని తెలపడంతో కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. భీమప్ప కుమారుడు కృష్ణ వచ్చి తండ్రిని తీసుకెళ్లాడు. ఫౌండేషన్ ప్రతినిధి ప్రవీణ్‌కుమార్‌ను అభినందించారు.

క్రైం కార్నర్

మద్యం తాగి డ్రైవింగ్.. విద్యుత్ స్తంభానికి ఢీ


విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

పరిగి, అక్టోబరు 2: ఓ వ్యక్తి మద్యం తాగి కారునడిపి బీభత్సం సృష్టించాడు. మంగళవారం అర్ధరాత్రి పరిగిలో సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు చెందిన జహీర్ మద్యం తాగి కారులో పరిగి టీచర్స్ కాలనీకి వెళ్తూ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో స్తంభం విరిగింది. కారు బెలూన్లు తెరుచుకోవడంతో జహీర్‌కు ఏమీ కాలేదు. మద్యం మత్తులో ఉన్న అతడికి స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. విద్యుత్ స్తంభం విరిగిపోడంతో రెండు గంటల పాటు సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ అధికారులు స్పందించి కొత్త సంభాన్ని బిగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

చోరీ అయిన ఫోన్ల రికవరీ.. అప్పగింత

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 2: పోచారం ఐటీ కారిడార్ పోలీసుస్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న పది మంది మొబైళ్లను పోలీసులు రికవరీ చేసి బుధవారం పోగొట్టుకున్న వారికి అందజేశారు. స్టేషన్ సీఐ రాజువర్మ మాట్లాడుతూ... సీఈఐఆర్ టెక్నాలజీతో సెల్‌ఫోన్ దొంగలను గుర్తించామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ జయంతిన మాంసం అమ్మిన వ్యక్తిపై కేసు

నవాబుపేట, అక్టోబరు 2: గాంధీ జయంతి రోజు బుధవారం మాంసం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు. శంకర్‌పల్లి మండలం సంకెపల్లికి చెందిన నాగేశ్ నవాబుపేట మండలం పూలపల్లి చౌరస్తాలో మాంసం అమ్ముతుండగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గాంధీ జయంతి రోజు మాంసం, మద్యం అమ్మకాలు నిషేధం అని, నిబంధన అతిక్రమించడంతో కేసు నమోదు చేశామన్నారు.

తాండూరులో గంజాయి చాక్లెట్ల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయి చాక్లెట్లు

తాండూరు, అక్టోబరు 2: ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ దాడుల్లో తాండూరులో గంజాయి చాక్లెట్లు, గంజాయి పౌడర్ పట్టుబడడం కలకలం రేపింది. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించారు. పట్టణంలో ఒడిశా రాష్ట్రం పూరీ తాలూకాకు చెందిన అనిల్‌కుమార్‌దాస్ అనే వ్యక్తి గంజాయి చాక్లెట్లు, ఎండు గంజాయి పౌడర్ అమ్ముతున్నట్టు సమాచారం అందింది. దీంతో జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో 400గ్రాముల గంజాయి చాక్లెట్లు 1.9కిలోల గంజాయి పౌండర్‌ను స్వాధీనం చేసుకున్నారు. మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. దాడుల్లో ఎస్ఐలు బి.ప్రేమ్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది విష్ణువర్ధన్‌రెడ్డి, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.